అత్యంత వైభవంగా సామూహిక కుంకుమార్చనలు

వైశ్య వికాస వేదిక సభ్యురాలు కాచం సుష్మ ఆధ్వర్యంలో నిర్వహణ

మహిళల భక్తి సందడితో కళకళలాడిన కన్యకా పరమేశ్వరి దేవాలయం





విశ్వంభర, కొత్తపేట: కొత్తపేటలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వైశ్య వికాస వేదిక, ఇష్ట లేడీస్ కిట్టి గ్రూప్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. వైశ్య వికాస వేదిక సభ్యురాలు కాచం సుష్మ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం మహిళల భక్తి సందడితో కళకళలాడింది. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో హాజరై అమ్మవారిని దర్శించుకుని, సామూహికంగా కుంకుమార్చన నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారికి కుంకుమ, పుష్పాలతో పూజలు చేసి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం కలగాలని ప్రార్థించారు. సామూహికంగా నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు వైశ్య వికాస వేదిక, ఇష్ట లేడీస్ కిట్టి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన వారికి వారాహి సిల్క్స్ తరఫున చీరలను ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్తా చేతుల మీదుగా అందజేశారు. లక్కీ డ్రాలో బహుమతులు అందుకోవడంతో మహిళల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్తా మాట్లాడుతూ మహిళలు ఇంత పెద్ద సంఖ్యలో ఒకచోట చేరి సామూహికంగా కుంకుమార్చన నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు మహిళల్లో భక్తి, ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతాయని పేర్కొన్నారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు కాచం సుష్మ సత్యనారాయణ మాట్లాడుతూ వైశ్య వికాస వేదిక, ఇష్ట లేడీస్ కిట్టి గ్రూప్ ఆధ్వర్యంలో మహిళలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే విధంగా వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా దినోత్సవం, సామూహిక కుంకుమార్చనలు, పండుగలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా నిర్వహించేందుకు కృషి

చేస్తున్నామని చెప్పారు. మహిళల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు పరస్పర స్నేహభావం, ఐక్యత పెంపొందించడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సామూహిక కుంకుమార్చన సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరస్పరం కుంకుమను ఇచ్చిపుచ్చుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమానికి హాజరైన మహిళలకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది. ఈ కార్యక్రమంలో తాళ్లపెల్లి సుజాత, బిలగంటి విజయలక్ష్మి, శిరీష, చీకటి మల్ల కవిత, పావని, సులోచన, ధనలక్ష్మి, సత్యలక్ష్మి, కిన్నెర, శిల్ప తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై సామూహిక కుంకుమార్చనలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈనెల 20నుంచి సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

10 రోజుల పాటు యూకే, అమెరికాలో పర్యటించనున్న రేవంత్ రెడ్డి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా, బ్రిటన్ పర్యటన షెడ్యూల్ ఖరారయ్యింది. ఈనెల 20 నుంచి 30 వరకు యూకే, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి ఇవాళ రాత్రికి దిల్లీకి వెళ్లనున్నారు. అక్కడ జరగనున్న సీడబ్ల్యుసీ సమావేశంలో సీఎం పాల్గొంటారు.గురువారం రాత్రి ఢిల్లీ నుంచి లండన్‌కు బయలుదేరనున్నారు. ఎల్లుండి రాత్రి 12.30 గంటలకు విమానం ఎక్కుతారు. ఈ నేపథ్యంలో సీఎం రెండు దేశాల్లో ఉన్న పలు వర్సిటీలను సందర్శించనున్నారు. అలాగే అక్కడి వర్సిటీ బృందాలతో సమావేశం కానున్నారు. లండన్?లో పర్యటన అనంతరం రేవంత్?రెడ్డి అమెరికాకు వెళ్తారు. ఆగస్టు 21న లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించనున్నారు. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో సీఎం పాల్గొననున్నారు. ఆగస్టు 22న లండన్‌లో కేంబ్రిడ్జ్ బృందంతో సీఎం సమావేశం కానున్నారు. ఆరోజు ఉదయం 11.30 గంటలకు యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్?ను సందర్శిస్తారు. ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్?కు వెళ్తారు. ఆగస్టు 23న లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరతారు. ఆగస్టు 24న బోస్టన్?లో ఉదయం 10.30 గంటలకు హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్?ను సందర్శిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎంఐటీ క్యాంపస్?కు వెళ్తారు. ఆగస్టు 25న ఉదయం 10.30 గంటలకు బోస్టన్?లో నార్త్ ఈస్టర్న్ క్యాంపస్?ను సందర్శిస్తారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు వర్జీనియా టెక్ యూనివర్సిటీ బృందంతో సమావేశం అవుతారు. అలా రాత్రి 7 గంటలకు బోస్టన్ నుంచి న్యూయార్క్? సిటీకి సీఎం పయనమవుతారు. ఆగస్టు 26న న్యూయార్క్?లో రాత్రి 7 గంటలకు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఆగస్టు 29న న్యూయార్క్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. ఆగస్టు 30న సీఎం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియపై కమిటీ సమావేశం

విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కే. కేశవరావు అధ్యక్షతన, వారి నివాసంలో కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థి ఉద్యమకారులు, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ప్రజాసంఘాలు, సబ్బండ వర్గాల ప్రతినిధులతో కమిటీ పలు దఫాలుగా సంప్రదింపులు జరిపింది.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వివిధ వర్గాల నుంచి వారి అనుభవాలు, అభిప్రాయాలు, సలహాలు, సూచనలను కమిటీ స్వీకరించింది. ఉద్యమ స్వరూపం, వివిధ దశల్లో ప్రజల భాగస్వామ్యం, ఉద్యమకారుల గుర్తింపునకు అవసరమైన ప్రమాణాలు తదితర అంశాలపై వచ్చిన సూచనలను సమావేశంలో సమీక్షించారు.స్వీకరించిన సలహాలు, సూచనలతో పాటు ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు సంబంధించిన అంశాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి, త్వరలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రితో కమిటీ సమావేశం కానుంది.

కేంద్ర పథకాల అమలులో జాప్యంపై ఎంపీ రఘురాం రెడ్డి ఆగ్రహం

విశ్వంభర, కొత్తగూడెం ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యాన్ని సహించేది లేదని దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే పథకాలు, అభివృద్ధి పనులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశా కమిటీ సమావేశంలో కేంద్ర పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. ఆసుపత్రులకు అవసరమైన సిటీ స్కాన్, ఇతర వైద్య పరికరాల కొనుగోలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ఖాళీ వైద్య పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లోని 124 ఐసోలేటెడ్ ఆవాసాలకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని మహబూబాబాద్ ఎంపీ పి. బలరాం నాయక్ సూచించారు. అటవీ అనుమతుల సమస్యలతో రహదారులు, విద్యుత్, తాగునీరు, రైతులకు సంబంధించిన పనులు నిలిచిపోకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు కోరారు. అమృత్ పథకం పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, పైప్‌లైన్ పనులతో దెబ్బతిన్న రహదారులను వెంటనే పునరుద్ధరించాలని ఎంపీ రఘురాం రెడ్డి ఆదేశించారు. పీఎంఏవై, ఉపాధి హామీ పథకాల పెండింగ్ చెల్లింపులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద రూ.17 కోట్ల వేతన బకాయిలు, రూ.50 కోట్ల మెటీరియల్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ అంకిత్ తెలిపారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశం అనంతరం ఇటీవల మృతి చెందిన అటవీ శాఖ సిబ్బంది బానోత్ నవీన్‌కు దిశా కమిటీ సభ్యులు ఒక నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు.

ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లు తొలగించింది: మహేశ్‌కుమార్ గౌడ్

విశ్వంభర, హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో ఎన్నికల సంఘం తెలంగాణలో నిర్దాక్షిణ్యంగా ఓట్లు తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. సర్ ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు."హైదరాబాద్‌లో బీఎల్‌వోలు ఎవరి ఇంటికీ వెళ్లలేదు. పేదలు, వలస కూలీల ఓట్లనే ఎక్కువగా తొలగించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉంది?కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీలాగే ఎన్నికల సంఘాన్ని కూడా తన జేబు సంస్థగా మార్చుకుంది. 2002 నాటి ఓటర్ల జాబితాతో ముడిపెట్టకుండా పౌరులకు ఓటు హక్కు కల్పించాలి. రాష్ట్రంలో అకారణంగా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది. మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేసింది. డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పు వల్ల 2002 నాటి వివరాలు సరిగా లేవు. లక్షల మంది ఓట్లు తొలగించి ప్రజాస్వామ్య దేశమంటే ఎలా?" అని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు.

జనగామకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలి: రాంచందర్ రావు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు డిమాండ్ చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను గుర్తిస్తూ జనగామ జిల్లాకు ఆయన పేరు పెడతామని కాంగ్రెస్ పార్టీ తన 2023 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తుకు చేశారు. ఆయన బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన గొప్ప ప్రజా యోధుడని, ఆనాటి సామాజిక అన్యాయాలు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి, సామాన్య ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేసిన ధీరుడు అని రాంచందర్ రావు కొనియాడారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం స్టేట్ చీఫ్ ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావొస్తున్నా ఆ హామీపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. బీసీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన అంశాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. కనీసం తెలంగాణ బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును జనగామ జిల్లాకు పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత రాజకీయ ఇబ్బంది ఎందుకు? అని ప్రశ్నించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ తరఫున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్పష్టంగా డిమాండ్ చేస్తున్నామని, జనగామ జిల్లాకు వెంటనే 'సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జనగామ జిల్లా'గా పేరు మార్చాలని కోరారు. బహుజన వర్గాల నుంచి ఎదిగి, ఆనాటి పాలక వ్యవస్థను, మొఘల్ ఆధిపత్యాన్ని సవాల్ చేసిన యోధుడిగా పాపన్న గౌడ్ చరిత్రలో నిలిచిపోయారని గుర్తుచేశారు. గోల్కొండ కోటపై తన ఆధిపత్యాన్ని స్థాపించి, వేలాది మంది సైనికులతో బలమైన సైన్యాన్ని నిర్మించి, ప్రజల కోసం పోరాటం సాగించారని తెలిపారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ఒక రాజుగా ఎదిగి, బడుగు బలహీన వర్గాలకు ఆత్మగౌరవాన్ని, ధైర్యాన్ని నింపిన చరిత్ర సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ది అని అన్నారు. అందుకే ఆయన నేటికీ తెలంగాణ ప్రజల గుండెల్లో ఒక గొప్ప యోధుడిగా, ప్రజా నాయకుడిగా చిరస్థాయిగా నిలిచారని గుర్తుచేశారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జన్మస్థలం జనగామ జిల్లాలోని ఖిలాషాపూర్ లో ఆయన జీవితం, పోరాటం, నిర్మించిన కోటలు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్.గౌతం రావు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌లో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి మధ్య వాగ్వాదం

విశ్వంభర, ఆసిఫాబాద్: రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది మాజీ సీఎం కేసీఆర్ అని రాష్ట్ర ఆబ్కారీ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. మంగళవారం కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకంలో కుట్టుమిషన్లు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ హరిత, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈక్రమంలో మంత్రి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

మొదట ఎమ్మెల్యే లక్ష్మి మాట్లాడుతూ.. గతంలో రూ.2.50 కోట్లతో సామెల రోడ్డు, రూ.1.50 కోట్లతో పాటగూడ రోడ్డు నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టినా.. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, మంత్రి చేపట్టిన పనుల పరిస్థితే ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. మంత్రి మాట్లాడుతూ.. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను గుడిసెల్లో ఉండే వారికే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 2018-23 మధ్య ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎన్ని ఇళ్లు నిర్మించారని అడగగా.. వాగ్వాదం మొదలైంది. ఇళ్లు నిర్మించకుండా కల్యాణలక్ష్మి, రైతు బంధు వంటి పథకాలు అమలు చేయలేదా? అయినా మంత్రి ఇలా మాట్లాడడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు.మంత్రి మాట్లాడుతూ గతంలో పాలించిన సీఎంలు రూ.65 వేల కోట్ల అప్పు చేస్తే.. పదేళ్ల కాలంలో కేసీఆర్ ఒక్కరే రాష్ట్రాన్ని రూ.8.25 లక్షల అప్పుల్లోకి నెట్టేశారని ఆరోపించారు. వాటికి నెలకు సుమారు రూ.6 వేల కోట్లు చొప్పున ఏడాదికి రూ.70 వేల కోట్ల వరకు వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. తద్వారా రాష్ట్రం అప్పుల కుప్పగా మారి ఖజానా ఖాళీ అయిందని చెప్పారు. దీంతో పనుల్లో కాస్త జాప్యం జరుగుతోందని, త్వరలో అభివృద్ధి పనులు పూర్తిచేస్తామన్నారు.

వాట్సప్‌లో గంజాయి ఆర్డర్లు.. డ్రగ్స్ ముఠా అరెస్ట్

విశ్వంభర, హైదరాబాద్: వాట్సప్‌లో గంజాయి ఆర్డర్లు తీసుకుని సప్లై చేస్తున్న ముఠాను తెలంగాణ ఈగల్ పోలీసులు పట్టుకున్నారు. ఒడిశాలో ఐదుగురు డ్రగ్ కింగ్‌పిన్‌లను అరెస్ట్ చేశారు. పోలీసులు ఏకకాలంలో 188 ప్రాంతాల్లో సోదాలు చేశారు. పట్టుబడిన గంజాయి వినియోగదారుల్లో ఏడుగురు విద్యార్థులు ఉన్నారు. గంజాయి ఆర్డర్ పెట్టిన వారిలో 100 మందికి డ్రగ్ టెస్టులు చేయగా, 80 మందికి పాజిటివ్‌గా తేలింది. 36 గంటల నాన్‌స్టాప్ ఆపరేషన్‌తో భారీ డ్రగ్ నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు. గంజాయి వినియోగదారులు ఫోన్‌పేలో చెల్లింపులు చేసినట్లు విచారణలో తేలింది. నిందితులు గూగుల్‌మ్యాప్ లోకేషన్ ద్వారా డెడ్‌డ్రాప్ పద్ధతితో డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల్లో ఓ బాలుడు ఉండడంతో నోటీసులు ఇచ్చారు.